క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక దొండపాడు లోనిబాల అయ్యప్ప క్షేత్రంలో సుబ్రహ్మణ్య స్వామి పునఃప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, మూల మంత్ర హోమం, ప్రధాన హోమం, రత్నన్యాసం నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ, కళావాహన, వినాయక, సుబ్రహ్మణ్య, మాలికాపురత్తమ్మ, అయ్యప్ప స్వామి వార్ల ఆలయ శిఖరాలకు భక్తిశ్రద్ధలతో మహా కుంభాభిషేకం నిర్వహించారు. స్వామివార్లకు విశేష అర్చన, అలంకారం చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. మధ్యాహ్నం మహా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు.

వేసవిలో చోరీలపై అవగాహన


సత్రంపాడులోని అపార్ట్‌మెంట్‌లో అవగాహన కల్పిస్తున్న సీసీఎస్ సీఐ మురళీకృష్ణ

ఏలూరు టౌన్: వేసవిలో చోరీలపై అప్రమత్తంగా ఉండాలని ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ నగర ప్రజలకు సూచించారు. ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, సీసీఎస్ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు ఆదేశాల మేరకు దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏలూరు సత్రంపాడు శ్రీలక్ష్మి సాయిటవర్స్ అపార్ట్‌మెంట్స్‌లో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ వేసవికాలంలో చోరీల నివారణకు ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రతి అపార్ట్‌మెంట్‌లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటి పనివిధానాన్ని తరచూ తనిఖీ చేయాలని సూచించారు. ఎవరైనా ఊరు వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఎల్‌హెచ్ఎంఎస్ విధానం వినియోగించుకోవాలని కోరారు. అనుమానిత వ్యక్తుల కదలికలు గుర్తిస్తే వెంటనే సమీపంలోని పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

గిరిజనుల్లో మానసిక చైతన్యానికి కృషి


మాట్లాడుతున్న గ్లోబల్ హెల్త్ ప్రాజెక్టు డైరెక్టర్ పల్లబ్ మౌలిక్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : రాష్ట్రంలోని గిరిజనుల్లో మానసిక ఆరోగ్యంపై చైతన్యం తీసుకురావడానికి జార్జ్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పల్లబ్ మౌలిక్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక అతిథి హోటల్‌లో ఆ సంస్థ తాజా ప్రాజెక్టు సాథికి సంబంధించిన సింపోజియం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజన గ్రామాల్లోని ప్రజల మానసిక రుగ్మతలపై వారిలో ఉన్న అపోహలను తొలగించడానికి అవసరమైతే చికిత్సకు, జీవనోపాధికి సహాయం చేయడమే సాథి ప్రాజెక్టు లక్ష్యమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 120 గిరిజన గ్రామాల్లోని సుమారు 25 వేల మంది జనాభాలో వయోజనులందరినీ తమ కార్యక్రమంలో భాగస్వాములను చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ రీసెర్చ్ ఫెలోస్ డాక్టర్ సిద్ధార్థ్ దేవరపల్లి, డాక్టర్ సంధ్య కనకయతిరాజుల, ప్రాజెకుట సూపర్‌వైజర్లు సూర్య సలాది, దుర్గ కొమరం పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో ఉదాసీనత

- లక్ష్యం రూ.66.40 కోట్లు.. వసూలు రూ.22.90 కోట్లే
- ఏలూరు నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ పన్నుల వసూళ్లలో వెనుకబడింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు సమయం సమీపిస్తున్నా ఇంకా 50 శాతం దాటకపోవటం గమనార్హం. పన్ను బకాలు భారీగా పేరుకుపోతున్నా వసూలు చేసే చర్యలు నామమాత్రంగానే ఉన్నాయని చెప్పాలి. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో మొత్తం పన్నులు రూ.42.73 కోట్లు వసూలు చేయాల్సుండగా, రూ.19.59 కోట్లు మాత్రమే వసూలు చేసినట్టు చెబుతున్నారు. మరోవైపు ఏలూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దటం, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు ఖర్చు చేస్తోన్న తరుణంలో నగరపాలక సంస్థ అధికారులు తమవంతుగా పన్నులను సకాలంలో వసూలు చేస్తే ఆదాయం సమకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సచివాలయాల్లోనూ పన్ను చెల్లింపులు

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 79 సచివాలయాల్లోనూ పన్నుల చెల్లింపులు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లి పన్నులు చెల్లించాల్సి వచ్చేది. తాజాగా సచివాలయాల ఏర్పాటుతో ప్రజలకు దూరం వెళ్లి లైన్‌లో నిలబడే సమస్య తప్పింది. వార్డు సచివాలయాల్లోని అడ్మిన్ సెక్రటరీలు పన్ను చెల్లింపులకు సంబంధించి ప్రజలను అప్రమత్తం చేస్తూ సకాలంలో చెల్లించేలా అవగాహన కల్పిస్తారు. సచివాలయ అడ్మిన్ సెక్రటరీలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేస్తూ ఉంటారు. ఇలా గతంలో కంటే సులువైన రీతిలో పన్ను చెల్లింపులకు అవకాశం ఏర్పడింది.

నిర్లప్తతతో వెనుకబాటు

ప్రజలు, వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి పన్నుల వసూలు చేయాల్సి ఉంది. కానీ అధికారులు, సిబ్బంది నిర్లిప్తతతో నగరపాలక సంస్థకు ఆదాయం సమకూరే అవకాశం లేకుండాపోతుందనే అభిప్రాయం ఉంది. ఏలూరు కార్పొరేషన్ పన్నుల లక్ష్యం రూ.66.40 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.22.90 కోట్లు చేశారు. ఇంకా రూ.43.50 కోట్లు పన్ను బకాయిలు ఉన్నట్టు తెలుస్తోంది. ప్రాపర్టీ ట్యాక్స్, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల పన్నులు, కుళాయి పన్నులు కలిపి భారీగా ఉంది.


ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం

పన్నుల వసూళ్లకు ప్రత్యేక చర్యలు



ఏలూరు నగరంలో పన్నుల వసూలు బాధ్యత సచివాలయ సెక్రటరీలకు అప్పగించాం. ఏలూరు నగరపాలక సంస్థలోనూ ప్రత్యేకంగా రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. పన్నుల చెల్లించాలంటూ నగరంలో మైక్ ప్రచారం చేయిస్తున్నాం. త్వరితగతిన పన్నులు వసూలుకు చర్యలు చేపట్టాం.

– సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు నగర కమిషనర్

ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు లక్ష్యం

నగరంలో గృహాలు	: 65,717
పన్ను బకాయిలు	: రూ.18.63 కోట్లు
వసూలు చేసింది	: రూ.4.82 కోట్లు
తాజా పన్నులు	: రూ.24.10 కోట్లు
వసూలు చేసింది	: రూ.14.77 కోట్లు
పన్నుల మొత్తం	: రూ.42.73 కోట్లు
మొత్తం వసూలు	: రూ.19.59 కోట్లు
ప్రభుత్వ కార్యాలయాలు	: 214
పన్ను బకాయిలు	: రూ.7.13 కోట్లు
వసూలు చేసింది	: రూ.47.02 లక్షలు
తాజా పన్నులు	: రూ.1.68 కోట్లు
వసూలు చేసింది	: రూ.35.80 లక్షలు
పన్నుల మొత్తం	: రూ.8.82 కోట్లు
వసూలు మొత్తం	: రూ.82.82 లక్షలు
నగరంలో కుళాయి కనెక్షన్లు	: 26,786
కుళాయి పన్ను బకాయిలు	: రూ.9.34 కోట్లు
వసూలు చేసింది	: రూ.74.72లక్షలు
తాజా పన్నుల లక్ష్యం	: రూ.3.49 కోట్లు
వసూలు చేసింది	: రూ.1.41 కోట్లు
పన్నుల మొత్తం	: రూ.12.83 కోట్లు
మొత్తం వసూలు	: రూ.2.16 కోట్లు

మెడికో లీగల్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ భీమేశ్వర్


మాట్లాడుతున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ భీమేశ్వర్, బోధనాసుపత్రి సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, డీసీహెచ్ఎస్ ఏవీఆర్ మోహన్

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ బోధనాసుపత్రిలో మెడికో లీగల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ అన్నారు. మెడికో లీగల్ సమస్యలపై మెడికల్ అధికారులు, వైద్యులతో ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రిలో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఫోరెన్సిక్ విభాగం ప్రొఫెసర్, హెచ్‌వోడీ కె.భాస్కర్ మెడికో లీగల్ సమస్యలు, వాటి విధి విధానాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ భీమేశ్వర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన, ఉత్తమ సేవలే లక్ష్యంగా పనిచేయాలని, నిర్లిప్తత, నిర్లక్ష్యం ప్రదర్శించరాదని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలగా రూపాంతరం చెందుతోన్న దశలో ఏర్పడే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఆదేశాల మేరకు నడచుకోవాలన్నారు. కార్యక్రమంలో బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీవీ విజయకుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఏవీఆర్ మోహన్, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాస్, మెడికల్ కళాశాల సిబ్బంది, జిల్లాలోని వైద్యాధికారులు ఉన్నారు.

దోసపాడు భూములను స్వాధీనం చేసుకోవాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న దోసపాడు దళితులు, పేదలు

ఏలూరు (టూటౌన్): దెందులూరు మండలం దోసపాడు దళితులు,పేదలకు జిల్లా కోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను అమలు చేయాలని, భూములను భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ దోసపాడు భూములను గత 25 సంవత్సరాలుగా అనుభవిస్తున్న విజయవాడకు చెందిన దేవినేని బాజీ ప్రసాద్ బినామీ ముళ్లపూడి శ్రీనివాసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణం అరెస్టు చేయాలని కోరారు. దోసపాడు దళితులు, పేదలకు 1956 నుంచి ప్రభుత్వం దఫదఫాలుగా అసైన్డ్, సీలింగ్, భూములు పంపిణీ చేసిందని తెలిపారు. ఆ భూములను విజయవాడ భూస్వాములు బలవంతంగా లాక్కుని చేపలు, రొయ్యలు చెరువులు తవ్వి అనుభవిస్తున్నారని, దీనిపై లోకాయుక్తను ఆశ్రయించగా 2015 జూలై 24న భూములను అసైన్డ్ దారులైన ఎస్సీలు, పేదలకు అప్పగించాలని ఆదేశించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు అంతగాని ఆనందరావు, చల్లా లాజర్ మణి, భూపోరాట నాయకులు డి.నాగేంద్ర, పి.సునీల్, పి.వెంకటరమణ, దేవకృప, శిరీష, ఏసుమణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షను నిర్మూలిద్దాం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆశ


స్ట్రీట్ వాక్ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ ఆశ, అధికారులు, సిబ్బంది

ఏలూరు టౌన్ : లింగ వివక్షతో భ్రూణ హత్యలకు పాల్పడడం విచారకరమని, లింగ వివక్షత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆశ అన్నారు. లింగ వివక్షత నిర్మూలన, జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు నగరంలో శుక్రవారం స్ట్రీట్‌వాక్ నిర్వహించారు. ఆర్‌ఆర్‌పేటలోని ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్స్‌ను సందర్శించి, లింగ వివక్షతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆంధ్ర హాస్పిటల్స్, వంశీ స్కాన్ సెంటర్లలో తనిఖీలు చేశారు. రికార్డులను, పరీక్షల రిపోర్టులను పరిశీలించారు. భ్రూణ హత్యల నివారిద్దామంటూ ఏలూరు ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ ఆశ మాట్లాడుతూ విధిగా ప్రతి హాస్పిటల్ యాజమాన్యం ప్రభుత్వ అనుమతులు పొందాలన్నారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లల్లో శక్తి సామర్థ్యాలు, నైపుణ్యాలు ముఖ్యమని, లింగ భేదంతో మహిళల పట్ల చిన్నచూపు సరికాదన్నారు. తమ పిల్లలను సమానంగా చూడడం నేర్చుకోవాలని తల్లి దండ్రులకు సూచించారు.

సంస్కృతికి ఆయువు పట్టు సంగీతం


సంగీత కళాకారులను సన్మానిస్తున్న ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : దేశ సంస్కృతిక సంగీతం ఆయువుపట్టని, సంగీతంతో రాళ్లను కరిగించవచ్చని, వ్యాధులను నయం చేయవచ్చని నిరూపించిన ఘన చరిత్ర భారతదేశానిదని వక్తలు పేర్కొన్నారు. నగరానికి చెందిన ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ 21వ వార్షికోత్సవం శుక్రవారం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాలులో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు కళాకారులు, సంగీత విద్వాంసులు మాట్లాడుతూ మన దేశంలో కర్ణాటక, శాస్త్రీయ, జానపద, సినీ సంగీతాలకు పెట్టిందిపేరని, ఆయా సంగీతాలు ప్రజలకు వీనుల విందు చేస్తూ దేశ సంస్కృతిని భావితరాలకు అందజేస్తోందని చెప్పారు. నగరానికి చెందిన సంగీత విద్యాంసుడు ఎస్‌పీఎస్ వాసు గత రెండు దశాబ్దాలకు పైగా సంగీత రంగానికి విశేష సేవలు అందించడం నగరానికి గర్వకారణమన్నారు. వాద్య సంగీతాలను యువతకు నేర్పుతూ అవకాశాలు కల్పిస్తూ సంగీత రంగానికి జీవం పోస్తున్నారని ప్రశంసించారు. ఉదయం నగరానికి చెందిన దివంగత సంగీత విద్యాంసులు అభినవ కబీరు సయ్యద్ పాచ్చా సాహెబ్ 103వ జయంతి ఉత్సవాలను నిర్వహించి దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన పాచ్చా సాహెబ్ శిష్యులు సంగీత విభావరి నిర్వహించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో పలువురు సంగీత కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేవీ సత్యనారాయణ, ఎండీ ఖాజావలి, పుల్లాభొట్ల పురుషోత్తం, పెదపాటి రామకృష్ణ, వి. రామ్ కుమార్, పస్తుల విజయకుమార్, గండికోట రాజేష్, డి.హేమసుందర్, నగరానికి చెందిన కళాకారులు, సాహిత్యకారులు, సంగీత విద్వాంసులు పాల్గొన్నారు. ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ ఎస్‌పీఎస్ వాసు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ధాన్యం, మొక్కజొన్న రైతుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

ఏలూరు (టూటౌన్): ధాన్యం, మొక్కజొన్న పంటల డబ్బులు ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతున్న బోడెంపూడి కిషోర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా ఎస్పీలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకులు డేగా ప్రభాకర్, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ గత సంవత్సరం ఏప్రిల్ నెలలో చాట్రాయి మండలం చనుబండ, ఆరుగోలన పేట తదితర గ్రామాల్లో రైతుల నుంచి రూ.2 కోట్ల విలువైన ధాన్యం, మొక్కజొన్న పంటలను ఎన్‌టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం మల్లెల గ్రామ నివాసి బోడెం కిషోర్ కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికే స్థానిక తహసీల్దార్, నూజివీడు సబ్ కలెక్టర్, ఎస్సై, సీఐడీ ఎస్పీలకు ఫిర్యాదు చేసినా ఇంత వరకూ రైతులకు న్యాయం జరగలేదని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల వెంకటేశ్వరరావు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం రైతు రుణ విమోచన చట్టాన్ని తెచ్చి రైతుల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో శుక్రవారం కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రుణాలు మాఫీ చేస్తోన్న కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ నష్టాలతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతుల రుణాలు ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ప్రధాని మోదీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. అన్ని పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ప్రకారం మద్దతు ధరలు ప్రకటించి అమలు చేయాలని, అందుకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తేవాలని డిమాండ్ చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే పూర్తి చేయాలని, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు, మార్కెట్ ధరల ప్రకారం పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు గండి రాజా, సున్నా వెంకట్రావు, అనుమోలు మురళి, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, ఎన్.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లకు 90 శాతం సబ్సిడీ


పొలం బడిలో మాట్లాడుతున్న ఏడీఏ సుబ్బారావు

ఏలూరు రూరల్ : వ్యవసాయ పనిముట్లు 90 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తున్నట్టు వ్యవసాయశాఖ ఏడీఏ వై.సుబ్బారావు అన్నారు. శుక్రవారం చొదిమెళ్లలో నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగం బలోపేతానికి ప్రభుత్వం ట్రాక్టర్లు, కల్టివేటర్లు, ట్రక్కులు, స్ప్రేయర్స్ రైతులకు అందిస్తున్నట్టు చెప్పారు. ఇందుకు రైతులు కస్టమ్ హైరింగ్ సెంటర్ గ్రూప్‌గా ఏర్పడాలన్నారు. దరఖాస్తు చేసుకున్న గ్రూప్‌నకు ప్రభుత్వం రుణం మంజూరు చేస్తుందని, ఇందులో 50 శాతం బ్యాంక్ లోన్, 40 శాతం ప్రభుత్వం రాయితీ కాగా మిగిలిన 10 శాతం రైతులు చెల్లించాలని వివరించారు. పలువురు రైతులు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న పొటాష్ ధర తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఏఓ జీవనసంధ్య, ఉద్యాన సహాయకురాలు బి.వాసవీ సౌజన్య, వలంటీర్ బి.భుజంగరావు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	21
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	34
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	33
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	32
ఏలూరు – తిరుపతి	16.00	4830	26

బీజేపీ విజయోత్సవం


విజయోత్సవంలో మాట్లాడుతున్న సుధాకర్ కృష్ణ

ఏలూరు (టూటౌన్): మూడు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన సందర్భంగా స్థానిక కుండీ సెంటర్‌లో శుక్రవారం విజయోత్సవం నిర్వహించారు. ఈస్ట్ మండల అధ్యక్షుడు లక్కోజు అనిల్ ఆచార్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొరళ్ల సుధాకర్ కృష్ణ పాల్గొని మాట్లాడారు. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ విజయదుందుభి మోగించి మరోసారి అధికారం చేపట్టడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో నాయకులు గాది రాంబాబు, మత్తి శ్రీనివాస శాస్త్రి, షేక్ కమ్రుద్దీన్, తోట వరప్రసాద్, నడపన దాన భాస్కరరావు, బాడిత నారాయణరావు, పసుపులేటి మనోహర ప్రసాద్, అడపాక సురేష్, ఎట్రించి ముఖేష్, గాలంకి సుగుణరావు, నెరుసు నెలరాజా తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లను గరిటెలతో వాయిస్తూ నిరసన


గానుగుల పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ఏలూరు (టూటౌన్): పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలంటూ ఐద్వా ఆధ్వర్యంలో ఏలూరు గాంధీ నగర్, గానుగుల పేటలో మహిళలు శుక్రవారం సాయంత్రం సిలిండర్లను గరిటెలతో వాయిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక గ్యాస్ సిలిండర్ ధర రూ.400 నుంచి రూ.1200కు పెంచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రాయితీలు, ప్రజలపై భారాలు వేస్తోందని ఆరోపించారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాలలో ఎన్నికలు అవ్వగానే బీజేపీ గ్యాస్ ధరలు పెంచిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు రాజేశ్వరి, జి.శారద, సారికి చిన్నమ్మ, సారికి కోమలి, నవుడూరి పద్మ, మోటూరి జయశ్రీ, సీఐటీయూ నాయకులు జె.గోపి, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.